

సాక్షి వికారాబాద్

బుధవారం । 8 । మార్చి । 2023



న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

కొడంగల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా కృషి చేయనున్నట్లు అదనపు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శంకర్, ఎస్‌ఐ రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి డిపోలో వేడుకలు



ఆర్టీసీ డిపోలో నిర్వహించిన జాతీయ మహిళా దినోత్సవంలో సిబ్బంది

పరిగి: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన అరుణ, సరిత, గీతమ్మ, లక్ష్మికి డీఎం పవిత్ర బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగారని సంతోషం వ్యక్తంచేశారు.

భక్తులతో కిటకిటలాడిన చిలుకూరు



చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం హోలీ పండుగతోపాటు పౌర్ణమి కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. 11 ప్రదక్షిణలు, 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాల యంలో సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

నేడు మీర్‌పేటలో వేడుకలు



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్లు

మీర్‌పేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మీర్‌పేట ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా ఉన్న ఓపెన్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సంబరాలకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, మహిళా కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

హెచ్‌ఆర్‌పీసీ సభ్యుడిగా వెంకటేశ్వర్లు

హుడాకాంప్లెక్స్: హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర సభ్యుడిగా నెలకంటి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి. లక్ష్మి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర సభ్యుడిగా పదవి అప్పగించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో చిన్న పిల్లలపై, మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ నిలదీసి బాధితులకు అండగా ఉంటుందన్నారు. ఈ మేరకు సేవలను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద సురేందర్‌రెడ్డి, కమిటీ సభ్యుడు కొండ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



తాండూరు టౌన్: భద్రప్ప చౌక్‌లో నిర్వహించిన హోలీ వేడుకల్లో జనసందోహం

ఊరూ వాడా.. రంగుల క్రీడ

జిల్లావ్యాప్తంగా మంగళవారం హోలీ సంబరాలు మిన్నంటాయి. యువత, చిన్నారులు రంగుల క్రీడల్లో మునిగితేలారు. సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుని నృత్యాలు చేస్తూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు డాక్టర్ ఆనంద్, రోహిత్‌రెడ్డి, కాలె యాదయ్య రంగులు పూసుకొని సందడి చేశారు.



వికారాబాద్: కలెక్టర్ నారాయణరెడ్డికి రంగులు పూస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ



వికారాబాద్: కలెక్టరేట్‌లో హోలీ సంబరాలు



తాండూరు టౌన్: సామూహిక హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



అనంతగిరి: వికారాబాద్‌లోని శివరాంనగర్‌లో యువత సందడి

వనితా వందనం

అన్ని రంగాల్లో రాణిస్తున్న అతివలు

- అధికారులు, ప్రజాప్రతినిధులుగా తమదైన ముద్ర
- పురుషులకు దీటుగా ముందుకు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

దోమ/కుల్కచర్ల: కార్యేషు దాసి.. కరణేషు మంత్రీ.. భోజ్యేషు మాత.. క్షమయా ధరిత్రీ.. ఇలా అమ్మలా లాలించి, భార్యగా ప్రేమించి.. సోదరిలా అండగా నిలుస్తున్న మహిళలు ఒకప్పుడు వంటింటికే పరిమితం. కానీ ఇప్పుడు సీన్ మారింది ప్రస్తుతం అపురూపమైనదమ్మ ఆడజన్మ.. స్వయం సాధికారతే ఆజన్మకు పరిపూర్ణత.. అనేలా సాగుతున్నారు అతివలు. ప్రజాప్రతినిధులుగా, ఉద్యోగులుగా అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తూ ఆకాశమే హద్దుగా ఎదుగుతున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళల మనోగతం..



జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, మహేశ్‌రెడ్డితో గిరిజన విద్యార్థులు

కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో సత్తా చాటుతున్నారు. వేదిక ఏదైనా మొదటి స్థానం వీరిదే. ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో అద్భుతమైన ప్రతిభ చూపి జిల్లా స్థాయి ప్రథమ బహుమతి అందుకున్నారు. మహిళా దినోత్సవ పోటీల్లోనూ తమదైన ముద్ర వేశారు.

ప్రోత్సహిస్తే అత్యుత్తమ ఫలితాలు



మహిళలను ప్రోత్సహిస్తే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారు. రాజకీయాల్లో కూడా మహిళలను ప్రోత్సహించాలి. స్త్రీలల్లో చైతన్యం వస్తే అవకాశాలు వాటంతట అవే వస్తాయి. సీఎం కేసీఆర్ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

– మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్, వికారాబాద్

చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి



చదువుతోనే మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరు. తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచి జీవిత చరమాంకం వరకు మహిళలపై జరుగుతున్న దాడులు హేయం. ఇపపటికీ ఇలాంటివి కొనసాగడం విచారకరం. చట్టసభల్లోనూ మహిళలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలి.

– కరుణ, ఎంపీపీ, బషీరాబాద్

అన్ని రంగాల్లో రాణించాలి



పురుషులతో సమానంగా రాణించినప్పుడే ఎక్కువ అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యం ఇస్తోంది. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలి. ఆయా రంగాల్లో కొనసాగుతున్న వారు ప్రతిభను మరింతగా మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగాలి.

– అనసూయ, ఎంపీపీ, దోమ

చిన్నచూపు తగదు



మహిళలు వయస్సుతో నిమిత్తం లేకుండా విద్యను అభ్యసించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత సమాజంలో మహిళలపై చిన్నచూపు తగ్గాలి. వీరి అభ్యున్నతికి ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలి.మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. ఐక్యంగా ఉంటూ హక్కులు సాధించుకోవాలి.

– షాహిదాబేగం, తహసీల్దార్, దోమ

మహిళల పాత్ర కీలకం



ప్రజాప్రతినిధులు, అధికారులుగా మహిళలు విధులు నిర్వహిస్తుండటం గొప్ప విషయం. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో మహిళలు మరింత సంఘటితం కావాలి. ఒకరికొకరు అండగా నిలబడి ముందుకు సాగాలి. కుటుంబ నిర్వహణలోనూ మహిళల పాత్ర కీలకమైనది.

– సత్యమ్మ, సర్పంచ్, కిష్టాపూర్

రైతే రాణి అనేలా మారాలి



రైతే రాజు అనే నినాదం నుంచి రైతే రాణి అనే నినాదం రావాలి. మండలంలో ఎక్కువ మంది మహిళలు వ్యవసాయ రంగంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం వీరిని తగిన విధంగా ప్రోత్సహిస్తే వ్యవసాయంలో మరింతగా రాణిస్తారు.

– కావ్య, ఏఈఓ, దోమ

ప్రత్యేకత చాటాలి



ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాలు, పట్టణాలను ఏలుతున్న మహిళలు పాలనలో స్వీయ నిర్ణయాలు తీసుకుంటూ ప్రత్యేకత చాటాలి.

– సత్యమ్మ, ఎంపీపీ, కుల్కచర్ల

క్రమశిక్షణ ముఖ్యం



ఏరంగంలోనైనా మహిళలు వృద్ధి సాధించాలంటే క్రమశిక్షణ, మనోధైర్యం అవసరం. విద్యార్థి దశలో ఉన్నవారు చదువుపైనే శ్రద్ధ చూపాలి. రాజకీయాల్లోని వారు ప్రజా సమస్యలపైనే ఎక్కువగా ఆలోచించాలి. ఉద్యోగాల్లో ఉన్నవారు వృత్తి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి.

– దేవి, కేజీబీవీ ప్రత్యేకాధికారి, కుల్కచర్ల

పండుగ పూట విషాదం

- కాగ్నా చెక్‌డ్యాంలో మునిగి బీటెక్ విద్యార్థి మృతి
- తాండూరులో ఘటన



అపస్మారక స్థితిలో ఉన్న ప్రదీప్‌ను బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్తున్న మిత్రులు

యాలాల: హోలీ పండుగ రోజున తాండూరులో విషాదం అలుముకుంది. రంగులు చల్లుకున్న అనంతరం స్నానం కోసం కాగ్నా నది చెక్‌డ్యాం వద్దకు వెళ్లిన బీటెక్ విద్యార్థి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని మల్‌రెడ్డిపల్లికి చెందిన ప్రదీప్‌కుమార్(18) నగరంలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హోలీ సందర్భంగా తోటి స్నేహితులతో సరదాగా రంగులు చల్లుకున్నారు.



ప్రదీప్ (ఫైల్)

అనంతరం పాత తాండూరు సమీపంలోని కాగ్నా నదిపై నిర్మించిన చెక్ డ్యాంలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఈతరాని ప్రదీప్ నీటి లోతును అంచనా వేయక మునిగిపోయాడు. ఇది గుర్తించిన స్నేతులు అతన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన ప్రదీప్‌ను బైక్‌పై తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఆర్‌పై అవగాహన రేపు

ఇబ్రహీంపట్నం: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై గురువారం ప్రత్యేకంగా అవగాహన నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ సతీష్‌వర్మ తెలిపారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రావు, సీపీఆర్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డా. విజయ్‌భాస్కర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. గుండె ప్రాథమిక చికిత్సకు ఉపయోగపడే సీపీఆర్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అక్రమ అరెస్టులతో ఆపలేరు



యాలాల: శివస్వాముల కుటుంబాలను పరామర్శిస్తున్న లక్ష్మణ్ తదితరులు

- తాండూరు గడ్డపై కాషాయ జెండా ఎగరేస్తాం
- బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్
- దేవనూరులో శివభక్తులకు పరామర్శ

యాలాల: అక్రమ అరెస్టులతో బీజేపీ ఎదుగుదలను ఆపలేరని ఆ పార్టీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మండల పరిధిలోని దేవనూరు గ్రామానికి చెందిన శివస్వాములు బెయిల్‌పై విడుదలైన సందర్భంగా మంగళవారం వారిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత నెల దేవనూరులో జరిగిన ఘటనలో ఐదుగురు శివస్వాములతో పాటు బీజేపీ నేత మురళీ కృష్ణగౌడ్‌పై అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని మండిపడ్డారు. శివస్వాములతో పాటు మురళీగౌడ్‌కు పార్టీ అండగా ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అనుచరులు ఇటీవల మురళీగౌడ్ ఇంటిపై దాడికి పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. పోలీసులు సైతం అధికార పార్టీ నాయకులకు వంత పాడటం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాండూరులో బీజేపీ రోజురోజుకూ బలపడుతోందని తెలిపారు. ఈ అక్కసుతోనే తమ పార్టీ నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అధికార గర్వంతో చెలరేగిపోతున్న కొంత మంది.. ఎన్ని కేసులు పెట్టించినా వెనక్కి తగ్గేదే లేదన్నారు. ఇందుకోసం ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టంచేశారు. వచ్చే ఎన్నికల్లో తాండూరు గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. త్వరలోనే కేసీఆర్ పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, నాయకులు మారుతీ కిరణ్, పరమేశ్వర్‌రెడ్డి, యాలాల మండల అధ్యక్షుడు మహిపాల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రూ.10 వేలు కట్టలేనన్నా.. కనికరించలేదు

- ట్రాఫిక్ పోలీసుల 'చలాన్' వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య
- వేధింపుల వల్లే చనిపోతున్నానని సూసైడ్‌నోట్

సైదాబాద్: ట్రాఫిక్ పోలీసుల 'చలాన్ల' వేధింపులు ఒక హమాలీ ప్రాణాన్ని బలితీసుకున్నాయి. కూలిపని చేసుకునే తాను చలాన్లు కట్టలేనని చెప్పినా ట్రాఫిక్ ఎస్ఐ కనికరించలేదని సీఎం కేసీఆర్, కేటీఆర్‌లకు తన బాధను వ్యక్తం చేస్తూ మృతుడు సూసైడ్ నోట్ రాశాడు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా దేవరకొండ మండలం నేరడిగొమ్ము గ్రామానికి చెందిన ఎ.ఎల్లయ్య (45) నగరానికి వలస వచ్చి ఐఎస్‌సదన్ డివిజన్ చింతల్‌బస్తీలో నివసిస్తున్నాడు. అతని భార్య సైదాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తుంది. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. హమాలీ పనిచేసే ఎల్లయ్య ద్విచక్రవాహనంపై మూడు చలాన్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆదివారం రాత్రి భారత్‌గార్డెన్ వద్ద విధులు నిర్వహిస్తున్న మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు అతని వాహనాన్ని తనిఖీ చేసి పెండింగ్ చలాన్‌లు ఉన్నాయని వాహనాన్ని సీజ్ చేశారు. అతను వాహనాన్ని విడిచి పెట్టాలని ఎన్నిసార్లు అడిగినా చలాన్‌లు చెల్లించాలని పోలీసులు తెలిపారు. చలాన్‌లు కట్టడానికి డబ్బులు లేకపోవడంతో మనస్థాపం చెందిన ఎల్లయ్య సోమవారం రాత్రి ఇంట్లో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న సైదాబాద్ పోలీసులు అతడి మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే మృతుడు రాసిన సూసైడ్ నోట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. అందులో ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌లకు తెలుపుతూ తన బాధ వ్యక్తం చేశాడు. 'మీర్‌చౌక్ పోలీసులు రూ.పది వేలు కడితేనే నా బండి ఇస్తామంటున్నారు. కూలిపని చేసుకునే వాడినని బతిమాలినా వారు ఒప్పుకోవడం లేదు.' అని ఎల్లయ్య సూసైడ్‌నోట్‌లో ఆవేదన వ్యక్తం చేశాడు. మీర్‌చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ వేధింపులు తట్టుకోలేక చనిపోతున్నాని అందులో పేర్కొన్నాడు. కాగా సైదాబాద్ పోలీసులు ఆత్మహత్య కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిపై దాడి చేసిన లెక్చరర్‌పై కేసు

మీర్‌పేట: వాట్సాప్ గ్రూపులో వీడియో పోస్టు చేసినందుకు గాను విద్యార్థిపై దాడికి పాల్పడిన లెక్చరర్‌పై మీర్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న దక్షియాదీప్ తరగతి గదిలో లెక్చరర్ మహేష్ ఓ విద్యార్థి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోను వాట్సాప్ గ్రూపులో పోస్టు చేయగా, మహేష్ అతనిపై దాడి చేసిన విషయం తెలిసిందే. కాగా విద్యార్థి ఫిర్యాదు మేరకు పోలీసులు లెక్చరర్ మహేష్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మంగళవారం కళాశాలకు సెలవు కావడంతో బుధవారం కళాశాలకు వెళ్లి విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో మేకల మృతి

కేశంపేట: కుక్కలు దాడిలో నాలుగు మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని వేములనర్వ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అల్లు రవీందర్‌రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద మేకలు ఉంచాడు. వాటిపై కుక్కలు దాడి చేయడంతో చనిపోయాయి. బాధిత రైతును ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: బూర్గుల గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి జాతీయ రహదారి దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు, కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

హైవే పనులు ఇక పరుగులు

ఎన్‌హెచ్ 167(ఎన్) టెండర్ల ప్రక్రియ పూర్తి

- ఏడాదిన్నర లోగా పూర్తి కానున్న హైవే
- నెరవేరనున్న జిల్లా వాసుల కల
- రూ. 1,336 కోట్లతో 102 కిలోమీటర్ల రోడ్డు
- పాతతాండూరు మీదుగా ఎన్‌హెచ్ రింగ్ రోడ్డు
- నాలుగు లేన్లతో ఇరు రాష్ట్రాల ఎన్‌హెచ్‌లతో అనుసంధానం



నేషనల్ హైవేగా మారనున్న రహదారి..

తాండూరు టౌన్: తెలంగాణ - కర్నాటక రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ నిర్మించనున్న నేషనల్ హైవే 167 (ఎన్) పనులు త్వరలోనే పరుగులు పెట్టనున్నాయి. రూ.1,336 కోట్ల వ్యయంతో 102 కిలోమీటర్ల మేర నిర్మించనున్న నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం రెండు ప్రధాన నేషనల్ హైవేలను అనుసంధానం చేయనున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ నుంచి కర్నాటక లోని చించోళి సమీపం వరకు ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఈ నేషనల్ హైవే ఎన్-44 తో పాటు, ఎన్‌హెచ్ -163లను అనుసంధానం చేయనున్నది. దీంతో ఇతర రాష్ట్రాలతో రవాణా వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందనున్నది. రోడ్డు నిర్మాణాలు సరిగ్గా లేక తీవ్ర ఇక్కట్ల పాలవుతున్న వికారాబాద్ జిల్లా వాసులకు నేషనల్ హైవే రూపంలో నాలుగు లేన్ల రోడ్డు మంజూరు కావడంతో ఆనందాలకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. ఇటీవలే టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, అగ్రిమెంట్‌ల అనంతరం పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ హైవే నిర్మాణం కోసం వచ్చే నెలలో ప్రధాని మోదీ హాజరై భూత్పూరు వద్ద భూమి పూజ చేయనున్నట్లు సమాచారం. ఏడాదిన్నర లోగా 102 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నది నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా లక్ష్యంగా కనపడుతున్నది.

రెండు ప్యాకేజీలలో..

మొత్తం 102 కిలో మీటర్ల మేర చేపట్టనున్న రోడ్డు పనులను రెండు ప్యాకేజీల కింద విభజించారు. మహబూబ్‌నగర్ ప్యాకేజీ-1 కింద భూత్పూర్ నుంచి దుద్యాల వరకు 60 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ. 704 కోట్లు, వికారాబాద్ ప్యాకేజీ-2 కింద దుద్యాల నుంచి కర్నాటకలోని చించోళి వరకు 42 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ. 632 కోట్లు వ్యయం చేయనున్నారు.

పాతతాండూరు మీదుగా బైపాస్..

ఎన్ హెచ్ 167 (ఎన్)లో భాగంగా కొడంగల్, తాండూరుల వద్ద రెండు బైపాస్ రోడ్లను నిర్మించనున్నారు. ఇందులో కాగ్నా నది నుంచి పాతతాండూరు మీదుగా గౌతాపూర్ వరకు 9 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం కావాల్సిన భూమిని ప్రభుత్వం సేకరిస్తున్నది. ఇప్పటికే 3ఏ గెజిట్ పబ్లిష్ కాగా, 3 డి గెజిట్ కోసం వ్యక్తిగత వివరాలతో కూడిన భూసర్వే ఆర్డీఓ అధికారి ఆధ్వర్యంలో కొనసాగుతున్నది.

తాండూరు పట్టణం నుంచి..

భూత్పూర్ నుంచి చించోళి వరకు వెళ్లనున్న ఈ నేషనల్ హైవే తాండూరు పట్టణం నుంచి అనుసంధాన రోడ్డుగా నిర్మాణం జరుగనున్నది. అలాగే తాండూరు పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తాండూరు సమీపంలోని కాగ్నా నది దగ్గరి నుంచి రింగ్ రోడ్డు నిర్మించనున్నారు. కాగ్నా నది నుంచి కుడి వైపున ఇప్పటికే ఖాంజాపూర్, రాజీవ్ కాలనీ నుంచి గౌతాపూర్ వరకు రింగ్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో జరుగుతున్నాయి. అలాగే ఎడమ వైపు పాతతాండూరు మీదుగా గౌతాపూర్ వరకు రింగ్ రోడ్డును నిర్మించనున్నారు. దీని కోసం అధికారులు భూసేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ పనులను నేషనల్ హైవే ఆధ్వర్యంలో రోడ్డును నిర్మించనున్నారు. అయితే ఇటీవల పాత తాండూరు పరిధిలోని భూసేకరణ సందర్భంగా కొన్ని అపోహలు తలెత్తాయి. ఇవన్నీ కేవలం ఊహాగానాలు మాత్రమేనని, త్వరలోనే పాతతాండూరు మీదుగా రింగ్ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో పాటు ఎన్‌హెచ్ఏఐ ఆర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు. నేషనల్ హైవే మీదుగా కొడంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఇటు పాతతాండూరు మీదుగా, రాజీవ్ కాలనీ మీదుగా నిర్మించనున్న రింగ్ రోడ్డు మార్గంలో పరుగులు పెట్టనున్నాయి.

త్వరలోనే ప్రారంభిస్తాం

త్వరలోనే మహబూబ్ నగర్ ఫేజ్ -1లో రోడ్డు పనులు, పాత తాండూరు మీదుగా వెళ్లనున్న రింగ్ రోడ్డు ప్రారంభించనున్నాం. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, అగ్రిమెంట్ అనంతరం పనులు ప్రారంభిస్తాం. మరో రెండు నెలల్లో వికారాబాద్ ఫేజ్-2 రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ఇందులో ఎలాంటి అపోహలు లేవు. ఎన్‌హెచ్ఏఐ పనులు నిరాటంకంగా కొనసాగనున్నాయి. ఏడాదిన్నర లోగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయనున్నాం.
- శరత్ చంద్ర, ఏఈఈ, ఆర్ అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

పరిగి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, అందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. మంగళవారం పట్టణంలో బీజేపీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే అర్హులకు పథకాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తోందని, ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీని మరింత పటిష్ట పరచాలన్నారు. అందుకోసం నాయకులు ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన ప్రజా గోస - బీజేపీ భరోసా శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్ నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్, అసెంబ్లీ కన్వీనర్ నరసింహ, నియోజకవర్గ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, పెంటయ్యగుప్తా, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటిస్తున్న ఉద్యోగులు

సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



యాప్‌లో ఉద్యోగుల హాజరు..

మోమిన్‌పేట: జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు యాప్ అటెండ్స్ సిస్టం తీసుకురావడంతో కచ్చితమైన వేళలు పాటిస్తున్నారు. యాప్ ద్వారానే వేతనాల చెల్లింపులుంటాయని కలెక్టర్ వారికి అవగాహన కల్పించి ఆదేశించారు. ఆఫీస్ సబార్డినేట్ నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతీ ఒక్కరూ వారు విధులకు వచ్చే సమయంలో, ముగించుకుని వెళ్లే సమయంలోనూ కార్యాలయం ఎదట ఫొటో అప్‌లోడ్ చేయాలనే నిబంధన తప్పనిసరి చేశారు. దీంతో ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. వారిలో జవాబుదారి పెరిగిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరు ఎక్కడ ఉంటారో తెలియక నానా ఇబ్బందిపడే వారు. ఈ నూతన విధానంతో ప్రతీ ఒక్కరూ అందుబాటులో ఉంటున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలువురు ఉద్యోగులకు విధులకు హాజరవ్వకున్నా టూర్‌లో ఉన్నామంటూ తప్పించుకునే వారికి ఈ యాప్‌తో ముకుతాడు వేసినట్లయిందని పలువురు చర్చించుకుంటున్నారు. పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చుట్టపు చూపుగా వచ్చేవారని, దీంతో పనులన్నీ కారోబార్‌లపై పడేదని ఇదివరకు ఆరోపించేవారు. 15 రోజులుగా అధికారులంతా అందుబాటులో ఉండడంతో ఆయా కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి

మొయినాబాద్: సమాజంలో మహిళలకు అన్ని రంగాల్లో సమానత్వం ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళ లేనిదే జననం, గమనం, సృష్టి లేవన్నారు. సృష్టికి మూలం అయిన మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకొచ్చి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళల భద్రతకోసం ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. షీటీంలు.. 181 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎలాంటి ఆపదలో ఉన్నా మహిళలు హెల్ప్‌లైన్‌కు కాల్ చేస్తే వెంటనే స్పందించడం జరుగుతుందన్నారు. మహిళల రక్షణకోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని.. వాటిపై ప్రతి మహిళకు అవగాహన ఉండాలన్నారు. మహిళా హక్కులకు ఎలాంటి భంగం కలుగకుండా మహిళా కమిషన్ అండగా ఉంటుందన్నారు. సాంకేతిక విద్యా పరంగా 62 శాతం యువతులు మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారని.. ఉద్యోగ రంగంలో 14 శాతం మంది మహిళలు మాత్రమే రాణిస్తున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు సమానత్వం సాధించాలని.. ఆ దిశగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కందకట్ల లక్ష్మీరెడ్డి, డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ విజయలత, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఆర్ చందన, ఏఓ వాణి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు



జిల్లేడ్ చౌదరిగూడ మండలం జాకారంలో వరిపైరును పరిశీలిస్తున్న ఏడీఏ రాజారత్నం

ముందు జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్లను అరికట్టవచ్చు



ఏడీఏ రాజారత్నం

కొందుర్గు: వరిసాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరిపైరును చీడపీడలను ఆశించి పంట తెగుళ్ల బారిన పడే అవకాశముందని, రైతులు ముందు జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్ల బారిన పడే ప్రమాదం ఉండదని అంటున్నారు. యాసంగి సీజన్‌లో ఆలస్యంగా వరి నాటువేస్తే జింక్ లోపంతో పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. ప్రస్తుతం చలి తీవ్రత వల్ల వరిపైరు ఏపుగా పెరగడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వరినాటే సమయంలో ముందుగా దుక్కిలో ఎకరానికి 10 కిలోల జింక్ చల్లి కలియదున్నాలి. వరినాటిన అనంతరం పిలకదశలో ఉన్న వరిపైర్లలో లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.

తీసుకోవాల్సి జాగ్రత్తలు...

పిలకదశ నుంచి దుబ్బు దశలో ఉన్న వరిపైర్లలో నాచు ఉండడం వల్ల ఎదుగుదల ఆగుతుంది. ఇందుకోసం వరిపైరును చేతులతో కలియబెట్టాలి. అదేవిధంగా అప్పుడప్పుడు పైరును ఆరగట్టాలి.

- ▲ పొలంలో చవుడు, జింక్‌లోపం వంటి సమస్యల నివారణ కోసం సేంద్రియ గుళికలు వాడడంతో పాటు, ఎకరానికి 25 నుంచి 30 కిలోల యూరియా, కార్బండాజిమ్ 25 శాతం, మ్యాంకోజెబ్ 50 శాతం పొడిమందును చల్లాలి.
- ▲ యాసంగి సీజన్‌లో వరికి మొగిపురుగు ఉధృతంగా వస్తుంది. నివారణ కోసం క్లోరిపైరిపాస్ 10 జీ గుళికలు లేదా సైపర్‌మిత్రిన్, క్లోరిపైరిపాస్ మందును పిచికారీ చేయాలి.
- ▲ వరి నాటిన 15 నుంచి 40 రోజుల దశలో ఉన్న పైర్లలో కార్బోఫ్యూరాన్ 3జీ 10 కిలోలు, లేదా కార్బోహైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 25 కిలోలు చల్లాలి.
- ▲ వరిపంట అంకురం ఏర్పడే దశ నుంచి చిరుపొట్ట దశలో ఎకరానికి 60 మిల్లీలీటర్ల క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 400 గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరైడ్ లేదా 100 మిల్లీలీటర్ల టెట్రానిలిప్రోల్ మందును పిచికారీ చేయాలి. ఇలా వరిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ రాజారత్నం సూచిస్తున్నారు. అలాగే ఫిబ్రవరి, మార్చి మాసాల్లో వరికి అగ్గి తెగులు, మెడవిరుపు తెగులు వచ్చే అవకాశం ఉందని ఆయన సూచించారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'పది'లో వంద శాతం లక్ష్యం

టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు

- వార్షిక పరీక్షలకు సిద్ధం చేసేలా నమూనా టెస్ట్‌లు
- పాఠ్యాంశాలపై ఎప్పటికప్పుడు అవగాహన
- పిల్లలను ప్రిపేర్ చేసేలా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్
- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు



షాద్‌నగర్ బాలికల పాఠశాలలో నమూనా పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వార్షిక పరీక్షల్లో పదికి పది శాతం జీపీఏ సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఈ మేరకు ప్రతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కార్యాచరణ ప్రకారం ముందుకు సాగుతున్నారు. ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాలా సిద్ధం చేస్తున్నారు.

ఇదీ ఫలితాల తీరు

సంవత్సరం	హాజరైన విద్యార్థులు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
2017	42,706	36,164	84.68
2018	43,392	37,809	87.13
2019	45,747	42,467	92.83
2022	47,157	42,460	90.04

సందేహాల నివృత్తి

పదో తరగతి విద్యార్థుల కోసం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4.45 నుంచి 6గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ఇప్పటికే సిలబస్ పూర్తి చేయగా పాఠాలను రివిజన్ చేయించడంతో పాటు, పాఠ్యాంశాల్లో వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

పరీక్షలంటే భయం పోయేలా..

పదో తరగతి పరీక్షా విధానంలో విద్యాశాఖ కీలక మార్పులు చేసింది. ఇప్పటి వరకు 11 పేపర్లను ఆరు పేపర్లకు కుదించింది. వాటిలో 80 మార్కులు మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. మిగతా 20 మార్కులు అంతర్గత పరీక్ష పద్ధతిలో నిర్వహించనున్నారు. పరీక్షా పత్రాల్లో మార్పులకు అనుగుణంగా పాఠశాలల్లో నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వార్షిక పరీక్షలంటే విద్యార్థుల్లో భయం పోవాలనే ఉద్దేశంతో నమూనా పరీక్షలు రాయిస్తున్నారు. వారం రోజుల పాటు బోధించిన పాఠాలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఎప్పటికప్పుడు తయారు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అవగాహన.. కౌన్సెలింగ్

విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు, పరీక్షలంటే భయం పోగొట్టేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అవగాహన సదస్సులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పాఠశాల నుంచి విద్యార్థులు ఇంటికి రాగానే, సెలవు రోజుల్లో సమయం వృథా చేయకుండా ఏవిధంగా చదివించాలన్న అంశంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

విద్యార్థులకు అల్పాహారం

జిల్లాలో 244 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు యాభైవేల మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. గత ఏడాది 90.04శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది వందకు వంద శాతం సాధించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నేపథ్యంలో ఏప్రిల్ 1వ తేదీ వరకు పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 ఖర్చు చేస్తోంది. ఇప్పటికే పరీక్షా మెటీరియల్ అందజేశారు.

ఒత్తిడిని అధిగమించేలా..



గతంలో కంటే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపడుతున్నాం. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నాం. పరీక్షల ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.
- ఝాన్సీ లక్ష్మి, జెడ్పీహెచ్ఎస్, హెచ్ఎం, వెలిజర్ల

ప్రత్యేకంగా దృష్టి



పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. బోధనా తరగతులతో ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. వార్షిక పరీక్షలకు విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేసేందుకు చర్యలు చేపట్టాం.
- శంకర్ రాథోడ్, ఎంఈఓ, ఫరూఖ్‌నగర్

పూర్తిస్థాయిలో సన్నద్ధం



ఈ సారి వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, ఆటలకు దూరంగా ఉండాలి. చదువుపైనే దృష్టి సారించాలి. - సుశీందర్‌రావు, డీఈఓ

కార్డు వద్దు..క్యాష్ ఇవ్వాలన్నందుకు కొట్టి చంపారు

జన్వాడ పెట్రోలు పంపువద్ద అర్ధరాత్రి దారుణం

- సిబ్బందిపై ముగ్గురు వ్యక్తుల దాడి
- నిందితులను శిక్షించాలని గ్రామస్తుల ఆందోళన



సంజయ్ (ఫైల్)

మణికొండ: నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని జన్వాడలోని పెట్రోల్ పంపు వద్ద సోమవారం అర్ధరాత్రి దారుణం చోటుచేసుకుంది. వాహనంలో పెట్రోల్ పోసి..స్వైపింగ్ మిషన్ పనిచేయటం లేదని, క్యాష్ మాత్రమే ఇవ్వాలనటంతో ఆగ్రహానికి గురైన ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఓ వ్యక్తి కణతపై గుద్దటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నార్సింగి సీఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... జన్వాడ చౌరస్తాలో ఉన్న శ్రీ పద్మావతి ఫిల్లింగ్ స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన సంజయ్ (22) పనిచేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి మల్లేష్, అశోక్, నరేందర్ అనే ముగ్గురు వ్యక్తులు మద్యం మత్తులో కారులో వచ్చి పెట్రోల్ పోయాలన్నారు. అప్పటికే పంపు మూసి వేశారు. చాలా దూరం వెళ్లాల్సి ఉందని పెట్రోల్ పోయాలని కోరటంతో నిద్రలేచిన కార్మికులు పోశారు. అనంతరం డబ్బులు ఇవ్వాలని కోరగా కార్డు ద్వారా చెల్లిస్తామన్నారు. తమ వద్ద ప్రస్తుతం స్వైపింగ్ మిషన్ లేదని, క్యాష్ రూపంలో ఇవ్వాలని క్యాషియర్ కోరాడు. దాంతో మాటామాటా పెరిగి పంపు సిబ్బందిపై దాడికి దిగారు. అడ్డు వచ్చిన సంజయ్ కణతపై గుద్దారు. దాంతో అతను అక్కడే కుప్ప కూలాడు. అవేమీ పట్టించుకోకుండా నిందితులు కారులో పారిపోయారు. స్పృహ తప్పి పడిపోయిన సంజయ్‌ను నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు డాక్టర్లు ధృవీకరించారు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా యువకుడి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జన్వాడ గ్రామస్తులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని పోలీసులు హామీ ఇవ్వటంతో ఆందోళనను విరమించారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనలో నిందితులపై పీడీ యాక్టు నమోదు చేస్తమని నార్సింగి సీఐ శివకుమార్ పేర్కొన్నారు. వీరిపై గతంలోనూ కేసులున్నాయని తెలిపారు.